## క్లుప్తంగా

### రేపు ఆయుర్వేద వైద్య శిబిరం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా సింగరేణి యాజమాన్యం ద్వారా మాతా రీసెర్చ్ సెంటర్ హైదరాబాద్ డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో శుక్రవారం గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో ఆయుర్వేద వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియాలో పని చేస్తున్న ఉద్యోగులు, పరిసర ప్రాంతాల ప్రజలు ఆయుర్వేద వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### కేజీబీవీలో అవగాహన సదస్సు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు బుధవారం ఎస్సై కొమురయ్య మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరించారు. అత్యవసర సమయంలో పోలీసులు అందజేస్తున్న సేవలను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇన్‌చార్జి ఎస్‌వో శారద, పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### 'ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపణలు అవాస్తవం'

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని కాలనీల్లో అక్రమంగా రోడ్లు, కల్వర్టులు నిర్మించినట్లు బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ చేసిన ఆరోపణల్లో నిజం లేదని సిర్పూర్(టి) గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ సయ్యద్ కిజర్‌హుస్సేన్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ పరిధిలో సుమారు వంద సీసీ రోడ్లు వేసి గ్రామపంచాయతీ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సమావేశంలో ఉపసర్పంచ్ తోట మహేశ్, నాయకులు విక్రమ్, వసీం, రమేశ్, నాని పాల్గొన్నారు.

### రేపు ఆసిఫాబాద్ బంద్

ఆసిఫాబాద్‌అర్బన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మరణకాండను నిరసిస్తూ ఆసిఫాబాద్ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో బంద్ పాటించాలని జాగో హిందూ కమిటీ అధ్యక్షుడు ఆకుల సంతోష్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కౌటాల: బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ దేవా లయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ హిందువులకు మద్దతుగా శుక్రవారం కౌటాల బంద్‌కు పిలుపునిచ్చినట్లు హిందూ ఐక్యవేదిక సభ్యులు బుధవారం తెలిపారు. మండలంలోని వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, హోటల్స్ స్వచ్ఛందంగా బంద్ పాటించాలని కోరారు.

### బంద్ ప్రశాంతం

కెరమెరి: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో బీజేపీ నాయకులు, హిందూవాహిని నాయకులు ఇచ్చిన బంద్ బుధవారం కెరమెరిలో ప్రశాంతంగా జరిగింది. ఉదయం నాయకులు తెరిచిన దుకాణాలను మూయించేశారు. వేణు, సెడ్మకి తుకారం, శ్రీకాంత్, శ్రీనివాస్, తిరుపతి, శ్రీకాంత్, పరదేశి, హన్మంతు, నరేశ్, ఉమేశ్, సుభాశ్, శ్రీధర్, ఉత్తం తదితరులు ఉన్నారు.

వాంకిడి: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన బందుకు స్థానిక దుకాణదారులు, వ్యాపారస్తులు సహకరించారు. బంగ్లాదేశ్‌లో మృతి చెందిన వారికి నివాళులర్పించారు.



# 'బడి స్వచ్ఛత'పై ఫోకస్



తక్కళ్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

- పారిశుధ్య పనులకు నిధులు
- విద్యార్థుల సంఖ్య ఆధారంగా కేటాయింపు
- తొలగనున్న సమస్యలు

రెబ్బెన: ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య పనుల నిర్వహణ చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన చేపడుతున్న ప్రభుత్వం బాధ్యతలను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించింది. తాజాగా ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న పారిశుధ్య పనుల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాల పర్యవేక్షణలోనే చేపట్టాలని నిర్ణయించింది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా పారిశుధ్య పనుల నిర్వహణ కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయనుంది. ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయగా విద్యాశాఖ అధికారులు పాఠశాల వారీగా విద్యార్థుల వివరాలను ప్రభుత్వానికి అందజేశారు. ఈ వివరాల ఆధారంగా ప్రభుత్వం పారిశుధ్య పనుల నిర్వహణ కోసం నిధులను కేటాయించనుంది.

**అమ్మ ఆదర్శ కమిటీల ఖాతాల్లోకి..**

మూడు సంవత్సరాల క్రితం ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను తొలగించిన అప్పటి ప్రభుత్వం పాఠశాలల్లో పారిశుధ్య పనుల బాధ్యతలు గ్రామ పంచాయతీలకు అప్పగించింది. ప్రతీ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పంచాయతీ కార్మికుల ద్వారా పారిశుధ్య పనులు చేపడుతుంది. పంచాయతీ కార్మికులు అంతంత మాత్రంగా పనులు చేపట్టడంతో పాఠశాలలు అపరిశుభ్రంగా మారిపోయాయి. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే సొంత డబ్బులు ఖర్చు చేసి ప్రైవేటు వ్యక్తులను నియమించి పారిశుధ్య పనులు చేయించుకున్నారు. మరికొన్ని పాఠశాలల్లో విద్యార్థులే చీపురు చేతపట్టి గదులు శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఎట్టకేలకు ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ సమస్యపై దృష్టి సారించడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదిరిగా పారిశుధ్య కార్మికుల కోసం అందజేసే నిధులను పాఠశాలకు అందించకుండా మహిళా సంఘాలకే అప్పగించాలని ప్రభుత్వం భావించింది. అమ్మ ఆదర్శ కమిటీల ఖాతాలోనే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు జమ చేయనుంది.

**పంచాయతీ కార్మికులకు ఊరట..**

గత ప్రభుత్వం పాఠశాలల్లో పారిశుధ్య పనుల బాధ్యతలను నిర్వర్తించే స్కావెంజర్లను తొలగించి ఆ పనులను గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి అప్పగించింది. దాంతో గ్రామాల్లో పారిశుధ్య పనులతో సతమతమయ్యే కార్మికులకు ప్రభుత్వ పాఠశాలల పారిశుధ్య పనులు భారంగా మారాయి. వారు అరకొరగా పారిశుధ్య పనులు చేపట్టడంతో తరగతి గదులు, పాఠశాలల పరిసరాలు అపరిశుభ్రంగా మారిపోయేవి. దీంతో విద్యార్థులే చీపురు పట్టి తరగతి గదులను శుభ్రం చేసుకునే వారు. వీటన్నింటిని గుర్తించిన ప్రభుత్వం పాఠశాలల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు నిధులు కేటాయించాలని నిర్ణయించింది. విద్యార్థుల సంఖ్యను బట్టి పారిశుధ్య పనుల కోసం నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

**మండలంలో ప్రభుత్వ పాఠశాలలు..**

| | |
|---|---|
| మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు | 45 |
| ప్రాథమికోన్నత పాఠశాలలు | 5 |
| జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు | 6 |

**పారిశుధ్య పనులకు కేటాయించే నిధులు ఇలా..**

| విద్యార్థుల సంఖ్య | కేటాయించే నిధులు (నెలకు రూ.వేలలో) |
|---|---|
| 1- 30 వరకు | 3 |
| 31-100 | 6 |
| 101-250 | 8 |
| 251-500 | 12 |
| 501-750 | 15 |
| 750 ఆపైన | 20 |

**మహిళా సంఘాలకు బాధ్యతలు**



పాఠశాలల్లో పారిశుధ్య పనుల నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం మహిళా సంఘాలకు అప్పగించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు సైతం జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా పాఠశాలలు, విద్యార్థుల వివరాలను అందజేశాం. పాఠశాలల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం పంచాయతీ సిబ్బంది ద్వారా పాఠశాలల్లో పారిశుధ్య పనులు జరుగుతున్నాయి.

– వెంకటేశ్వరస్వామి, ఎంఈవో

## బదిలీపై వచ్చిన ప్రాజెక్టు అధికారికి సన్మానం



నరేందర్‌ను సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు



ఎస్‌ఈని సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీ నూతన ప్రాజెక్టు అధికారిగా బదిలీపై వచ్చిన నరేందర్‌ను బుధవారం ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ నాయకులు వేర్వేరుగా సన్మానించారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి ఆధ్వర్యంలో ఏఐటీయూసీ నాయకులు పీవోకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు.

**జీఎంకు సన్మానం**

బెల్లంపల్లి ఏరియా నూతన జీఎం శ్రీనివాస్‌ను బుధవారం కైరిగూడ ఓసీపీలో టీబీజీకేఎస్ నాయకులు శాలువాతో సన్మానించారు. టీబీజీకేఎస్ నాయకులు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని, ఓసీపీ భవిష్యత్తును పెంచడానికి తోడ్పడాలన్నారు. ఏరియా కార్యదర్శి వెంకన్న, ఫిట్ కార్యదర్శి వెంకటేశం, సెంట్రల్ కమిటీ నాయకులు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**ఎస్‌ఈ కోటయ్యకు..**

బెల్లంపల్లి ఏరియా గోలేటి సీహెచ్‌పీకి నూతనంగా బదిలీపై వచ్చిన ఎస్‌ఈ కోటయ్యను బుధవారం టీబీజీకేఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు, ఫిట్ కార్యదర్శి రమేశ్, సెంట్రల్ కమిటీ నాయకులు సమ్మయ్య, ఏరియా కార్యదర్శి సంపత్, ఏరియా కమిటీ నాయకులు శ్రీనివాస్, వీరస్వామి, విద్యాసాగర్, వరలక్ష్మి, కమిటీ సభ్యులు అర్జయ, మురళీకృష్ణ, సుగ్రీవులు, శ్రీనివాస్, కవిత తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నష్టపరిహారం అందించాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

బెజ్జూర్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా సిర్పూర్ నియోజకవర్గంలోని ప్రాణహిత ఉప్పొంగి పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పంట నష్టపరిహారం వెంటనే చెల్లించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ బెజ్జూర్ సహకార సంఘంలో రుణమాఫీ అయిన రైతులకు డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. సహకార సంఘంలో దాదాపు రూ.4 కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, వంతెనలు లేక మారుమూల గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. నాయకులు రాజకుమార్ యాదవ్, సలీం, రాంప్రసాద్, నవీన్, ఖాజా సెమియోద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

### యువత ఆరోగ్యంగా ఉండాలి

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులు, యువత ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం పురోగతి సాధిస్తుందని ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ శివదర్శన్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఇంటర్నల్ క్వాలిటీ అస్యురెన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్యం, పరిశుభ్రత అంశంపై ఆయన ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే నిత్యం వ్యాయామం చేయడం, సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత లేకపోవడం వల్ల వ్యాధులు వ్యాపిస్తాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మినరసింహం, వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## శిక్షణ తరగతులు విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో ఈ నెల 16 నుంచి 18వ తేది వరకు సిద్దిపేటలో నిర్వహించే శిక్షణ తరగతులకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించుకోవడానికి పీడీఎస్‌యూ సంఘం నిర్వహించే విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులను విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు హరిశ్చంద్ర ప్రసాద్, శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

## షీటీం సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వర్లు

కెరమెరి: మహిళలు, బాలికలను వేధిస్తే నిర్భయంగా సమాచారమివ్వాలని షీటీం ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లలను, మహిళలను వేధిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు మరింత దగ్గరై సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఏదైనా సమస్య వస్తే 100కు కాల్ చేయాలన్నారు. సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబర్ 1930, ఆసిఫాబాద్ షీ టీం నంబర్ 8712670564 కు సమాచారం ఇవ్వాలన్నారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, ఆత్మహత్యలు, డ్రగ్స్, బాల్యావివాహాలు, వరకట్న వేధింపులు తదిరాలపై అవగాహన కల్పించారు. సునీత, శ్రీలత, హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## ఉత్తమ ఉద్యోగుల ఎంపిక



గోలి ప్రసాద్



డి. లోకేష్



విజయ్‌కుమార్

రెబ్బెన: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని బెల్లంపల్లి ఏరియాలో ఉత్పత్తి సాధన, విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులను ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసినట్లు ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియా స్థాయిలో ఉత్తమ ఉద్యోగులుగా కైరిగూడ ఓసీపీలో ఈపీ ఆపరేటర్‌గా విధులు నిర్వహించే సాలిగామ రవి, ఆకుల గంగయ్యతో పాటు గోలేటి సీహెచ్‌పీలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించే గోలి ప్రసాద్‌లను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉత్తమ విద్యార్థిగా సింగరేణి ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి డి. లోకేష్‌లను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఏరియా స్థాయిలో ఎంపికైన ఉత్తమ ఉద్యోగులను గోలేటిలోని జీఎం కార్యాలయంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సన్మానించి జ్ఞాపికలు అందజేస్తామన్నారు.

**ఉత్తమ సింగరేణియన్‌గా విజయ్‌కుమార్**

బెల్లంపల్లి ఏరియా నుంచి ఉత్తమ సింగరేణియన్‌గా కై రిగూడ ఓసీపీకి చెందిన ఈపీ ఆపరేటర్ ఎం జారపు విజయ్‌కుమార్‌ను ఎంపిక చేసినట్లు ఏరియా జీఎం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ సింగరేణియన్‌గా ఎంపికైన ఉద్యోగిని కొత్తగూడెంలో జరగబోయే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సింగరేణి సీఅండ్ఎండీ సన్మానించనున్నట్లు తెలిపారు.

## గిరిజనులకు వసతులు కల్పించాలి



వీర్దండి గ్రామంలో పరిశీలిస్తున్న అధికారులు

కౌటాల: గిరిజన గ్రామాల్లో ప్రజలకు అన్ని వసతులు కల్పించాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి అన్నారు. బుధవారం మండలంలోని వీర్దండి, మొగడ్‌దగడ్, గురుడుపేట ఏజెన్సీ గ్రామాలను ఆమె పరిశీలించారు. ఏజెన్సీ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. గ్రామాల్లోని కాలనీల్లో తిరిగి ఆదివాసీ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలు ఉన్న తెలియజేయాలని సూచించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని తెలిపారు. ఆదివాసీ ప్రజల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆమె వెంట ఎస్‌ఆర్పీ మడావి పోచాని, మాజీ సర్పంచ్ రేణుక, తదితరులు ఉన్నారు.

## దేశ సమైక్యత కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలి



పంపిణీ చేసిన జాతీయ జెండాలతో గోలేటి ప్రజలు



కోవ లక్ష్మికి జెండా అందజేస్తున్న అధికారులు



జాతీయజెండా అందిస్తున్న పోస్టల్ అధికారులు

రెబ్బెన: దేశంలోని ప్రతి పౌరుడు దేశ సమైక్యత కోసం పాటుపడాలని బీజేపీ అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం గోలేటిలో బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశ సమైఖ్యతను చాటాలన్నారు. మండల ప్రధాన కార్యదర్శి ఓదెలు, బూత్ అధ్యక్షుడు వసంత్‌రావు, ఆటో యూనియన్ అధ్యక్షుడు ప్రతాప్, నాయకులు శ్రీనివాస మల్లేశ్, గోపాలక్రిష్ణ, సుధాకర్, ప్రభాకర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మికి తన నివాసంలో తపాలా శాఖ కాగజ్‌నగర్ సబ్‌డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సతీశ్ సిబ్బందితో కలిసి జాతీయ జెండా అందజేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి గజదత్‌సింగ్ షెకావత్ సందేశాన్ని ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రతీ ఒక్కరు పండుగ వాతావరణంలో జరుపుకోవాలని, త్రివర్ణ పతాకాన్ని ప్రతీ ఇంటిపై ఎగురవేయాలని కోరారు. దేశ స్వతంత్ర పోరాటంలో అమరులైన నాయకులను, వీరులను స్మరించుకొంటూ వారికి నివాళులర్పించాలని పేర్కొన్నారు. తపాలా సిబ్బంది అభిషేక్, రాకేశ్, మనోజ్, సుధాకర్, బాలాజీ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పురస్కరించుకొని పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో ఎంపీ గోడెం నగేశ్, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుకు బుధవారం కాగజ్‌నగర్ సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సతీశ్ జాతీయజెండా అందించారు. కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పంపించిన సందేశాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని సూచించారు. పోస్టల్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న రావి శ్రీనివాస్

బెజ్జూర్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని లుంబినగర్ గ్రామానికి చెందిన కొంత మంది రైతులు ఏళ్లుగా చేసుకుంటున్న పోడు భూములను అటవీ శాఖ అధికారులు సాగు చేయనివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని బుధవారం రావి శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఇప్పలగూడ గ్రామానికి చెందిన సీనియర్ కార్యకర్త సత్తయ్య తల్లి అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, నాయకులు, ఉన్నారు.

### ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మిట్ట దేవేందర్

తిర్యాణి: సమగ్రశిక్ష అభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యూలరైజ్ చేయాలని సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు మిట్ట దేవేందర్ అన్నారు. బుధవారం మండలంలోని మాణిక్యపూర్ కేజీబీవీలో నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం అందించకుండా శ్రమ దోపిడీకి గురి చేస్తుందన్నారు. గతంలో సీఎం రేవంత్ రెడ్డి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని కానీ ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అనంతరం సంఘం నూతన మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎం.రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా రాజేశ్, ఉపాధ్యక్షుడిగా పుష్పలత, కోశాధికారిగా దామెదర్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

### వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో దత్తారావు

వాంకిడి: ప్రజలు వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవాలని డీఆర్‌డీవో దత్తారావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం స్థానిక అధికారులతో కలిసి పర్యటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఇంకుడు గుంత నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తేనె శుద్ధి కేంద్రాన్ని సందర్శించారు. ఆయన వెంట ఎంపీవో ఖాజా అజిజుద్దీన్, ఏపీవో శ్రావణ్‌కుమార్, ఏపీఎం శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఎల్కపల్లి పంచాయతీ కార్యాలయంలో బుధవారం మండల పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చిట్యాల నరేశ్, అధ్యక్షుడిగా చౌదరి రాకేశ్, ఉపాధ్యక్షులుగా జాడి అర్చన, కోట రాజేశ్, ప్రధాన కార్యదర్శిగా కుకిడే చంద్రశేఖర్, కోశాధికారిగా ఇందారపు శ్రీకాంత్, సలహాదారులుగా కిష్టయ్య, మధుకర్, సోషల్‌మీడియా కన్వీనర్ శ్రీధర్, సభ్యులుగా చంద్రయ్య, రాధా, గణేశ్ పాల్గొన్నారు. నూతన కమిటీని ఎంపీడీవో అల్బర్ట్, కార్యాలయ సిబ్బంది అభినందించారు.